ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 195 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 22 అక్టోబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# పోలీస్ శాఖలో 7,437 పోస్టుల భర్తీకి
# అనుమతి ఇచ్చాం : సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 21 (ప్రభాత ఉదయం)**

శాంతి భద్రతలు బాగుంటేనే రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నివాళులర్పించింది. వారి కుటుంబాలకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని భారీగా పెంచామని వెల్లడించారు. 2028 నాటికి పోలీస్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో జరిగిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో మహిళా భద్రత, డ్రగ్స్ గంజాయి సైబర్ నేరాల కట్టడి, కల్తీ ఆహారంపై ప్రభుత్వ చర్యలపై సీఎం వివరాలు వెల్లడించారు.

**అమరవీరులకు నివాళులర్పించిన సీఎం**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీస్ స్మారక పరేడ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్‌తోపాటు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం వారి సేవలను స్మరించుకుంటూ రూపొందించిన 'అమరులు వారు' పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అమరులకు నివాళి అర్పించిన అనంతరం ప్రసంగించిన సీఎం, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం భావోద్వేగంతో కూడిన రోజని పేర్కొన్నారు. సమాజం కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీసుల సేవలను మరువలేమన్నారు. అమరుల కుటుంబాల్లో ఏర్పడిన లోటును ఎవరూ భర్తీ చేయలేరని అయితే వారి కుటుంబాలు ఒంటరివి కావని, తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ, సమాజం అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.

**పరిహారం భారీగా పెంపు**

పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం వెల్లడించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని భారీగా పెంచినట్లు తెలిపారు. కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు కోటి రూపాయలు, ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్లకు కోటి 25 లక్షలు, డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు కోటి 50 లక్షల రూపాయలు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రెండు కోట్ల రూపాయల పరిహారం అందించేలా నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవమని సీఎం స్పష్టం చేశారు. హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను పది లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత ముఖ్యమని సీఎం పేర్కొన్నారు.

**మహిళల భద్రతకు ప్రాధాన్యం**

పోలీస్ శాఖను ..మిగతా 2లో



## తెలంగాణలో మద్యం
# అమ్మకాల జోరు

**19 రోజుల్లోనే రూ.2,054 కోట్లు**

**గత ఏడాదితో పోలిస్తే 37.02 శాతం వృద్ధి**

**బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా పెరుగుదల**

**30.37 లక్షల కేసులకు చేరిన బీర్ల విక్రయాలు**

**అమ్మకాలు 18.38 లక్షల కేసులకు పెరుగుదల**

**అక్టోబర్ 19న రూ.303.40 కోట్ల విక్రయాలు**

**హైదరాబాద్, అక్టోబర్ 21 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో దసరా పండుగ సీజన్‌లో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. అక్టోబర్ 1 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే విక్రయాలు 37.02 శాతం పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు వెల్లడించాయి. పండుగ వేళ బీర్లకు డిమాండ్ గణనీయంగా పెరగడం ఈసారి ప్రత్యేకంగా కనిపించింది. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ తో పోలిస్తే బీర్ల విక్రయాలు వేగంగా పెరిగాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 19 వరకు 21.55 లక్షల కేసుల బీర్లు అమ్ముడవగా, ఈ ఏడాది ఆ సంఖ్య 30.37 లక్షల కేసులకు చేరింది. దీంతో బీర్ల అమ్మకాల్లో ..మిగతా 2లో

# తెలంగాణకు బీసీ సీఎం
## కానీ ఇప్పుడే కాదు: మహేశ్ గౌడ్

**బీసీ వ్యక్తి సీఎం కావడానికి డెడ్‌లైన్ ఏమీ లేదన్న మహేశ్ గౌడ్**

**రేవంత్ రెడ్డి పాలన 2039 వరకు కొనసాగుతుందని విశ్వాసం**

**కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణకు బీసీ సీఎం సాధ్యమని వ్యాఖ్య**



**హైదరాబాద్, అక్టోబర్ 21 (ప్రభాత ఉదయం)**

తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉ ందని మహేశ్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాదని, ..మిగతా 2లో

# సీజేపీ నేతలకు ఊరట.. విడుదలకు కోర్టు ఆదేశాలు

**సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాకు ఊరట**

**విడుదలకు ఎస్ఈఎం కోర్టు ఆదేశాలు**

**కస్టడీ పొడిగింపుపై హైకోర్టులో పిటిషన్ ఉపసంహరణ**

**జంతర్ మంతర్ చొరబాటు కేసులో అరెస్టు**

**ఎస్ఐఆర్‌పై నిరసన సందర్భంగా నినాదాలు**




**న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (ప్రభాత ఉదయం)**

జంతర్ మంతర్ చొరబాటు కేసులో అరెస్టయిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాకు ఊరట లభించింది. వారిని విడుదల చేయాలని ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో పోలీసులు వారిని మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్ నుంచి ఎస్ఈఎం కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ విచారణకు ముందు సీజేపీ న్యాయ వ్యవహారాల విభాగం అధిపతి రత్నా సింగ్ కూడా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అంతకుముందు తమ విడుదలను కోరుతూ ఎస్ఈఎం కోర్టు కస్టడీని పొడిగించడాన్ని సవాలు చేస్తూ దాస్, రంకా దాఖలు ..మిగతా 2లో



# ఇండియా కూటమి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతాం: బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్

**ఇండియా కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందన్న బీజేపీ ఎంపీ లక్ష్మణ్**

**న్యాయవ్యవస్థ, రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తున్నారని ఆరోపణ**

**అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా కార్యక్రమాలు**

**అక్టోబర్ 23 నుంచి నవంబర్ 5 వరకు సభలు, సమావేశాలు**

**రాహుల్ గాంధీ అధికార దాహంతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శ**

2లో..

# ఢిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం

**అమల్లోకి వచ్చిన గ్రాప్ స్టేజ్1 ఆంక్షలు**

**కాలుష్య నియంత్రణ చర్యలను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు.- ఢిల్లీ-ఎన్‌సీఆర్ అంతటా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) తొలి దశ అమలు చేశారు.**




**న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (ప్రభాత ఉదయం)**

దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం మరోసారి ఆందోళన కలిగిస్తోంది. గాలి నాణ్యత సూచీ దిగజారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కాలుష్య నియంత్రణ చర్యలను వేగవంతం చేసేందుకు ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) స్టేజ్-1ను తక్షణమే అమలు చేస్తున్నట్లు వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) బుధవారం ప్రకటించింది. రానున్న రోజుల్లోనూ గాలి నాణ్యత ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

**ఒక్కరోజులోనే పెరిగిన కాలుష్యం**

ఢిల్లీలో అక్టోబర్ 20న వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 179గా నమోదైంది. ఇది 'మోస్తరు' కేటగిరీ పరిధిలోకి వస్తుంది. అయితే అక్టోబర్ 21న మధ్యాహ్నం 2 గంటలకు ఈ సూచీ 244కు చేరింది. దీంతో గాలి ..మిగతా 2లో



## బలపరీక్ష పెడితే తృణమూల్ ఎమ్మెల్యేల
# మద్దతూ మాకే

**బెంగాల్ సీఎం సువేందు సంచలన వ్యాఖ్యలు**

**బలపరీక్ష పెడితే తమకు 275 మంది ఎమ్మెల్యేల మద్దతు లభిస్తుందన్న సువేందు అధికారి**

**టీఎంసీ నుంచి గెలిచిన 64 మంది ఎమ్మెల్యేలు బీజేపీకి మద్దతిస్తారని ధీమా**

**ప్రజలు ఎన్నుకున్న 'సనాతన' ప్రభుత్వం తమదని వ్యాఖ్య**

**భవానీపూర్‌లో మాజీ సీఎం మమతపై తన గెలుపును ప్రస్తావించిన అధికారి**

**49 ఏళ్ల వామపక్ష, టీఎంసీ పాలన సమస్యలను పరిష్కరిస్తున్నామన్న సీఎం**

2లో..



# పోలీస్ శాఖలో 7,437 పోస్టుల భర్తీకి

## అనుమతి ఇచ్చాం : సీఎం రేవంత్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి...**

మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మరో ఐదు వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టామని, 2028 నాటికి పోలీస్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించామని వెల్లడించారు. ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించడం ద్వారా వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించే ప్రయత్నం చేశామన్నారు. హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు పోలీసు సిబ్బంది పిల్లలకు విద్యావకాశాలు కల్పించేందుకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. సైబర్ నేరాలు, డ్రగ్స్, కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపి మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు.

“పోలీస్ శాఖను బలోపేతం చేసేందుకు ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 4,773 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. పోలీసుశాఖలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చాం. మిగతా ఖాళీలను కూడా విడతల వారీగా భర్తీ చేస్తాం. 2028 నాటికి పోలీసుశాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తాం. పోలీసుశాఖలో ఎక్స్‌గ్రేషియాను హోదా ఆధారంగా రూ.కోటికి పైగా పెంచాం” -రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

**డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ సేవలు భేష్**

యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ ఫోర్స్ పనితీరును, డీజీపీని అభినందించారు. కల్తీ ఆహారాన్ని అరికట్టేందుకు టీజీ సేఫ్ వ్యవస్థను తీసుకొచ్చామని వెల్లడించారు. మహిళల భద్రతకు షీ టీమ్స్ సేవలను కొనసాగిస్తూ మరిన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించాలని, బాధితులకు న్యాయం అందించడంలో జాప్యం జరగకూడదని సీఎం సూచించారు. మహిళల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు.

# ఢిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం

**మొదటి పేజీ తరువాయి...**

నాణ్యత ‘పూర్’ కేటగిరీలోకి వెళ్లింది. ఒక్కరోజు వ్యవధిలోనే కాలుష్య స్థాయిలు గణనీయంగా పెరగడం అధికారులను అప్రమత్తం చేసింది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (ఐఐటీఎం) అంచనాల ప్రకారం, రానున్న రోజుల్లోనూ ఢిల్లీలో గాలి నాణ్యత ‘పూర్’ కేటగిరీలో కొనసాగే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితిని సమీక్షించిన, భారత వాతావరణ శాఖ, ఇతర సంస్థలు కాలుష్యాన్ని మరింత పెరగకుండా నిరోధించేందుకు తొలి దశ చర్యలను అమలు చేయాలని నిర్ణయించింది.

**జీఆర్‌ఏపీ స్టేజ్-1 ఎందుకు?**

వాయు కాలుష్యం పెరుగుతున్నప్పుడు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి దశలవారీగా చర్యలు చేపట్టే విధానమే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్. గాలి నాణ్యత ఆధారంగా వివిధ దశల్లో నియంత్రణ చర్యలను అమలు చేస్తారు. ప్రస్తుతం ఢిల్లీలో ఏక్యూఐ 244కు చేరడంతో తొలి దశను అమల్లోకి తీసుకొచ్చారు. ఈ నిర్ణయం ఢిల్లీకి మాత్రమే పరిమితం కాకుండా మొత్తం జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలో వర్తిస్తుందని సీఏక్యూఎం స్పష్టం చేసింది. సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, అమలు చేసే ఇతర విభాగాలు తమ పరిధిలోని చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించింది. ఇప్పటికే అమల్లో ఉన్న కాలుష్య నియంత్రణ మార్గదర్శకాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించింది. గాలి నాణ్యత మరింత దిగజారకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపింది. పౌరులు కూడా జీఆర్‌ఏపీ స్టేజ్–1లో సూచించిన మార్గదర్శకాలను పాటించాలని కోరింది.

**పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తాం**

ఢిల్లీతో పాటు ఎన్‌సీఆర్‌లో గాలి నాణ్యతను అధికారులు నిరంతరం గమనిస్తారని సీఏక్యూఎం తెలిపింది. వాయు కాలుష్య స్థాయిలు, వాతావరణ శాఖలు వెల్లడించే భవిష్యత్ అంచనాలను బట్టి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొంది. అవసరాన్ని బట్టి అదనపు చర్యలపై సమీక్ష ఉంటుందని వెల్లడించింది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. జీఆర్‌ఏపీ తొలి దశ అమలుతో కాలుష్య నియంత్రణకు సంబంధించిన ప్రస్తుత చర్యలను ముమ్మరం చేయడంపై అధికారులు దృష్టి సారించనున్నారు.

**గత పదేళ్లలో కాలుష్యం తీవ్ర సమస్య: మంత్రి**

ఢిల్లీలో వాయు కాలుష్యంపై పర్యావరణ శాఖ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా ఆందోళన వ్యక్తం చేశారు. గత పదేళ్ల నుంచి 12 ఏళ్ల కాలంలో రాజధానిలో గాలి నాణ్యత తీవ్రంగా దెబ్బతిన్నదని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వాలు కాలుష్యానికి పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, రాజస్థాన్ వంటి రాష్ట్రాలను బాధ్యులుగా చూపుతూ వచ్చాయని, అయితే సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోలేకపోయాయని విమర్శించారు. అదే సమయంలో ప్రస్తుత ఏడాదిలో ఇప్పటివరకు 214 రోజులు ‘గుడ్’ లేదా ‘మోడరేట్’ కేటగిరీల్లో గాలి నాణ్యత నమోదైందని మంత్రి వెల్లడించారు. కొవిడ్ ప్రభావిత సంవత్సరాన్ని మినహాయించి చూస్తే, గత 12 ఏళ్లలో ఇదే అత్యధికమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలతో పాటు ఢిల్లీ ప్రజల సహకారం వల్లే ఈ ఫలితం సాధ్యమైందని తెలిపారు.



# సీజేపీ నేతలకు ఊరట.. విడుదలకు కోర్టు ఆదేశాలు

చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. అయితే కేసులోని అంశాలపై ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేదు. జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం.. ముందుగా ఎస్ఈఎం కోర్టులో జరిగే విచారణ కోసం వేచి ఉండాలని, ఆ తర్వాత అవసరమైతే తగిన న్యాయపరమైన మార్గాన్ని ఎంచుకోవాలని వారి తరఫు న్యాయవాదులకు సూచించింది. అక్కడే ఉపశమనం లభిస్తే హైకోర్టులో పిటిషన్‌పై విచారణ కొనసాగించాల్సిన అవసరం ఉండదని పేర్కొంది. సోమవారం ఎస్ఈఎం రీతూ రాజ్ ఈ ఇద్దరి జ్యుడీషియల్ కస్టడీని అక్టోబర్ 21 వరకు పొడిగించారు. వారి ప్రవర్తన వల్ల శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందని ఆ సందర్భంగా పేర్కొన్నారు. అక్టోబర్ 11న నైరుతి ఢిల్లీ జిల్లాలోని ఎస్ఈఎం ముందు సమర్పించిన బాండ్ల నిబంధనలను వారు ఉల్లంఘించారని, ప్రస్తుత కేసులోనూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని కోర్టు తన ఉత్తర్వుల్లో నమోదు చేసింది. దర్యాప్తు అధికారి సమర్పించిన వివరాలను ప్రస్తావిస్తూ.. శాంతిభద్రతలకు భంగం కలిగే ప్రమాదం ఉందన్న ఆందోళనను కూడా పరిగణనలోకి తీసుకుంది. గతంలో సమర్పించిన పూచీకత్తులు విచారణలో సరైనవి కావని తేలడంతో కొత్త పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది.

సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాతో పాటు సీజేపీ సభ్యుడు అజింక్య షిండే సహా మొత్తం 14 మందిని అక్టోబర్ 13న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రైవేటు ప్రాంగణం నుంచి జంతర్ మంతర్‌లోకి ప్రవేశించి, విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు అడ్డంకులు కలిగించారన్నది వారిపై ఉన్న ఆరోపణ. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో అక్రమాలు జరిగాయంటూ సీజేపీ సభ్యులు నిరసన చేపట్టి, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు, వీరిని విడుదల చేస్తే చట్ట ఉల్లంఘనలు మళ్లీ జరిగే అవకాశం ఉందని, ఇతరులను కూడా ప్రేరేపించవచ్చని పేర్కొంటూ ఢిల్లీ పోలీసులు గతంలో విడుదలను వ్యతిరేకించారు.



# తెలంగాణకు బీసీ సీఎం

**మొదటి పేజీ తరువాయి...**

2039 వరకు కూడా అధికారంలో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. వచ్చే టర్మ్‌లో మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు. బీసీ సీఎం నినాదం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన అని మహేశ్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కొండా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని అన్నారు.



## కేటిదొడ్డిలో ఘనంగా

# దసరా వేడుకలు

**జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసిన మార్కట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు,మండల నాయకులు ఉరుకుందు, గ్రామ సర్పంచ్**

**ఆత్మీయంగా అలయ్ బలయ్ తీసుకున్న గ్రామ ప్రజలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21(ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండల కేంద్రంలో విజయదశమి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్కట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు,మండల నాయకులు ఉరుకుందు, గ్రామ సర్పంచ్ నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా వేడుకల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విజయ దశమి సందర్భంగా ముందుగా గ్రామంలో జెండా ఆవిష్కరించి, ఆంజనేయ స్వామి దేవాలయంలో కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాజా భజంత్రీలతో గ్రామ శివారులో ఏర్పాటు చేసిన జమ్మిచెట్టు వద్దకు చేరుకున్నారు. అక్కడ శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సంప్రదాయబద్ధంగా జమ్మి ఆకులను పరస్పరం ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ అలయ్ బలయ్ తీసుకున్నారు. అనంతరం గ్రామస్థులతో కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. దసరా పర్వదినాన దుర్గామాత ఆశీస్సులతో గద్వాల నియోజకవర్గ ప్రజలు, మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.




# కృష్ణానదిలోకి దూసుకెళ్లిన కారు.. ఇద్దరికి తీవ్రగాయాలు

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21(ప్రభాత ఉదయం):**

గద్వాల పట్టణంలోని నదీ అగ్రహారం వద్ద గల కృష్ణానది పుష్కరఘాట్ వద్ద బుధవారం ఓ కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి నదిలోకి దూసుకెళ్లిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి.స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవరాత్రి ఉత్సవాల అనంతరం గద్వాల ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు బుధవారం నదీ అగ్రహారం పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గద్వాలకు చెందిన కృష్ణయ్య తన కారును ఘాట్ వద్ద ఆపి పూజల్లో పాల్గొన్నారు. అయితే, అనుకోకుండా కారు హ్యాండ్ బ్రేక్ విడిపోవడం (న్యూట్రల్ కావడంతో) ఒక్కసారిగా కారు ముందుకు కదిలి, అక్కడ పూజల నిమిత్తం వేసిన టెంట్ను ఢీకొంటూ నేరుగా కృష్ణానదిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన స్థానికులు మరియు పోలీసులు క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన గద్వాల పోలీసులు, క్రేన్ సహాయంతో కృష్ణానదిలో పడిపోయిన కారును బయటకు వెలికితీశారు.



## తెలంగాణలో మద్యం

# అమ్మకాల జోరు

**మొదటి పేజీ తరువాయి...**

41 శాతానికి పైగా వృద్ధి నమోదైంది. ఇక ×వీఖీ విక్రయాలు గత ఏడాది 14.16 లక్షల కేసులుగా ఉండగా, ఈసారి 18.38 లక్షల కేసులకు పెరిగాయి. అక్టోబర్ 19న రాష్ట్రంలో ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. పండుగ సీజన్ ప్రారంభంలో అమ్మకాలు నెమ్మదిగా సాగినా, రెండో వారం నుంచి వేగం పుంజుకున్నాయి. అక్టోబర్ 16 నాటికి మొత్తం విక్రయాల విలువ రూ.1,527.85 కోట్లుగా ఉండగా, మరో మూడు రోజుల్లోనే రూ.2,000 కోట్ల మార్కును దాటింది. అక్టోబర్ 19 వరకు నమోదైన గణాంకాల ఆధారంగానే ఈ వివరాలను ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

# బలపరీక్ష పెడితే తృణమూల్ ఎమ్మెల్యేల మద్దతూ మాకే

**బెంగాల్ సీఎం సువేందు సంచలన వ్యాఖ్యలు**

**బలపరీక్ష పెడితే తమకు 275 మంది ఎమ్మెల్యేల మద్దతు లభిస్తుందన్న సువేందు అధికారి**

**టీఎంసీ నుంచి గెలిచిన 64 మంది ఎమ్మెల్యేలు బీజేపీకి మద్దతిస్తారని ధీమా**

**ప్రజలు ఎన్నుకున్న ‘సనాతన’ ప్రభుత్వం తమదని వ్యాఖ్య**

**భవానీపూర్‌లో మాజీ సీఎం మమతపై తన గెలుపును ప్రస్తావించిన అధికారి**

**49 ఏళ్ల వామపక్ష, టీఎంసీ పాలన సమస్యలను పరిష్కరిస్తున్నామన్న సీఎం**

**పశ్చిమ బెంగాల్ అక్టోబర్ 21 (ప్రభాత ఉదయం)**

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో రేపే బలపరీక్ష (ఫ్లోర్ టెస్ట్) నిర్వహించినా, తమ ప్రభుత్వానికి 275 మంది ఎమ్మెల్యేల మద్దతు లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) టికెట్‌పై గెలిచిన 64 మంది శాసనసభ్యులు కూడా తమకే మద్దతిస్తారని, దీంతో తమ సంఖ్య 275కి చేరుకుంటుందని బుధవారం స్పష్టం చేశారు.

కోల్‌కతాలోని చోర్‌బగాన్‌లో ఇటీవల దుర్గా పూజ మండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో మరణించిన బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. “రేపు అసెంబ్లీలో బలపరీక్ష పెట్టమనండి. మా సంఖ్య 275కి చేరుకుంటుంది” అని అన్నారు. ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సోషల్ మీడియా లేదా టీవీ చర్చల ద్వారా రాలేదని, ప్రజల ప్రత్యక్ష మద్దతుతోనే సాధ్యమైందని నొక్కి చెప్పారు.

ఈ సందర్భంగా భవానీపూర్‌లో మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఓడించిన విషయాన్ని గుర్తు చేస్తూ తమది ప్రజలు ఎన్నుకున్న ‘సనాతన’ ప్రభుత్వమని సువేందు అధికారి అభివర్ణించారు. గత 49 ఏళ్లుగా వామపక్ష, టీఎంసీ పాలనలో పేరుకుపోయిన సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తోందని విమర్శించారు.

2026లో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 294 స్థానాలకు గాను, 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించుతూ బీజేపీ 208 సీట్లు గెలుచుకుని అధికారం చేపట్టింది. టీఎంసీ కేవలం 80 స్థానాలకే పరిమితమైంది. ఎన్నికల ఫలితాల అనంతరం టీఎంసీలో అంతర్గత విభేదాలు తలెత్తడం, పార్టీ గుర్తు కోసం ఓ వర్గం న్యాయపోరాటం చేస్తున్న నేపథ్యంలో సువేందు అధికారి వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### పత్రికా రంగంలో 30 సంవత్సరాలుగా సేవలందిస్తున్న

# అప్పారెడ్డి గూడెం భీమయ్యకు అభినందనలు






**బుద్వేల్, అక్టోబరు 21 ( ప్రభాత ఉదయం) :**

పత్రికా రంగంలో 30 సంవత్సరాలుగా సేవలందిస్తున్న పాత్రికేయులు అప్పారెడ్డిగూడెం భీమయ్య ను పలువురు అభినందించారు. 1996 అక్టోబరు 21 న ఈనాడు తెలుగు దినపత్రిక రిపోర్టర్ గా చేరిన భీమయ్య అనంతరం 2002 లో ఆంధ్రజ్యోతి రిపోర్టర్ గా చేరారని గుర్తు చేసుకున్నారు. 30 సంవత్సరాలు గా ప్రజల సమస్యలను వెలికి తీయడం, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండి వార్తలు రాయడం లో అప్పారెడ్డి గూడెం భీమయ్య చేసిన కృషి అభినందనీయమని గుర్తు చేసుకున్నారు.

**అభినందించిన మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి :**

30 సంవత్సరాల పాటు పత్రికా రంగంలో పని చేస్తు అందరి మన్ననలు పొందుతూ వస్తున్న అప్పారెడ్డి గూడెం భీమయ్య కు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి అన్నారు.

**30 సంవత్సరాలు పాత్రికేయుడిగా నిలదొక్కుకోవడం సంతోషకరం : ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ :**

30 సంవత్సరాలు గా పాత్రికేయులుగా పని చేస్తూ అందరి మన్ననలు పొందిన భీమయ్య కు అభినందనలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి వార్తలు రాయడం లో మరింత చురుకుగా పని చేయాలని సూచించారు.

**జర్నలిస్టుల అభినందనలు :**

అందరిని కలుపుకు పోతు, మంచి వార్తలు రాస్తూ మచ్చలేని రిపోర్టర్ గా పనిచేస్తున్న పాత్రికేయులు అప్పారెడ్డిగూడెం భీమయ్య పలువురికి ఆదర్శ ప్రాయులని సీనియర్ పాత్రికేయులు మేకల దామోదర్ రెడ్డి, మేక్కొండ ప్రేమ్ రాజ్, బుడిగెల బాబు రావు, వర్కాల చందు, గద్దె యాదగిరి, కోరని మహేష్ లతో పాటు పలువురు పాత్రికేయులు శుభాకాంక్షలు తెలియ చేశారు. కేక్ కట్ చేయించి సన్మానించారు.

**ప్రత్యేక ప్రార్ధనలు చేసిన పాస్టర్లు:**

పాత్రికేయులు అప్పారెడ్డిగూడెం భీమయ్య కు రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపి ప్రార్ధనలు చేశారు. దేవుడు ఎల్లవేళల భీమయ్య కు సహాయకుడిగా ఉండాలని ప్రార్ధనలు చేశారు. కేక్ కట్ చేయించి సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ గవర్నింగ్ బాడి సభ్యులు రెవరెండ్ కె సుందర్ పాల్, అధ్యక్షుడు రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్, ప్రధాన కార్యదర్శి పాస్టర్ ప్రణీత్ బాబు, కోశాధికారి పాస్టర్ బట్టు శ్రీకాంత్, బ్రదర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.




స్నేహ అప్పారెడ్డి గూడెం

## నేడు స్నేహ అప్పారెడ్డి గూడెం జన్మదిన వేడుకలు

**బుద్వేల్, అక్టోబరు 21 (ప్రభాత ఉదయం)**

సీనియర్ పాత్రికేయులు అప్పారెడ్డిగూడెం భీమయ్య కుమార్తె స్నేహ అప్పారెడ్డి గూడెం పుట్టిన రోజు వేడుకలను గురువారం బుద్వేల్ లోని వారి నివాసంలో నిర్వహించనున్నారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాము అని కుటుంబ సభ్యులు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఐశ్వర్య. గాయపడ్డ మాథ్యూస్

## రోడ్డు ప్రమాదంలో ఓ యువతి దుర్మరణం

**బుద్వేల్, అక్టోబరు 21 (ప్రభాత ఉదయం)**

దసరా పండగ రోజు లారీ క్రింద పడి ఓ యువతి దుర్మరణం చెందిన సంఘటన ఇది. చెల్లెలి పెళ్లయిన రెండు రోజులకే అక్క మరణించడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంలో పెళ్లి కోసం ఒంగోలు నుంచి వచ్చిన మరో యువకుడు తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజేంద్రనగర్ ఎస్ఐ రాఘవేందర్ తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి... బండ్లగూడ కాళీమందిర్ సమీపంలోని అభ్యుదయ నగర్ లో నివాసం ఉ ఒడే పరిశుద్ధరావు రెండవ కుమార్తె ప్రైవేటు స్కూల్ లో టీచర్ గా పనిచేస్తున్న ఐశ్వర్య (25), ఒంగోలు నుంచి రెండు రోజుల క్రితం జరిగిన తమ చెల్లెలి పెళ్లికి వచ్చిన మాథ్యూస్(26) తో కలసి మంగళవారం ఉదయం టిఫిన్ చేయడానికి కాళీమందిర్ వద్దకు బైక్ పై వచ్చారు. టిఫిన్ చేసి తిరిగి అభ్యుధయ నగర్ వైపు వెళుతున్నారు. అదే సమయంలో ఏపీ29 యు 0575 నెంబరు లారీ కి కాళీమందిర్ వద్ద పూజలు చేసుకుని కిస్మత్పూర్ వైపు వెళుతున్నారు. బైక్ నడుపుతున్న మాథ్యూస్ ఆ లారీ ని దాటుకుని వెళ్లాలనుకుని ముందు పడిపోయాడు. ఈ సంఘటన లో లారీ క్రింద పడిన ఐశ్వర్య అక్కడిక్కడే మృతి చెందింది. మాథ్యూస్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న రాజేంద్రనగర్ ఎస్ఐ రాఘవేం దర్ సంఘటన స్థలానికి చేరుకుని లారీ ని స్వాధీనం చేసుకున్నారు. లారీ నడుపుతున్న యువకుడు అక్కడినుంచి పారిపోయాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



చింతల్ మెట్ హస్తాల వీరన్న గుట్ట వద్ద కాషాయ జెండా లతో నాయకులు వై శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి, ఎం కొమురయ్య లు



హస్తాల వీరన్న గుట్ట వద్ద కాషాయ జెండా తో బొక్క బాల్ రెడ్డి



కాటేదాన్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్ద చిన్నారులతో టీడీపీ నాయకులు ఉస్కేమూరి విజయ్ కుమార్



బుద్వేల్ శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయం వద్ద జరిగిన రావణ దహనం



మాణిక్యమ్మ కాలనీ లో జరిగిన అమ్మ వారి ఊరేగింపు లో పాల్గొన్న బిజేపీ నాయకులు వై శ్రీధర్ తదితరులు

# రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో ఘనంగా దసరా వేడుకలు

**బుద్వేల్, అక్టోబరు 21 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో మంగళవారం దసరా వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయాలలో జరిగిన జమ్మి పూజ లో పాల్గొని ఒకరికొకరు విజయ దశమి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు, పెద్దలు నూతన వస్త్రాలు దరించి సంతోషంగా గడిపారు. తమకు తెలిసిన వారికి, స్నేహితులకు మిఠాయిలు పంచిపెట్టారు. రాజేం ద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ తో పాటు వివిధ పార్టీల నాయకులు పి అర్చన జయప్రకాశ్, వై.శ్రీధర్, ఎస్ వెంకటేశ్, బొక్క బాల్ రెడ్డి, ఎం కొమురయ్య, పి మల్లేశ్ యాదవ్, కొలన్ సుభాష్ రెడ్డి, పసుపుల సందీప్ ముదిరాజ్, గుంజ బాబురావు, ఎర్రోళ్ల యాదయ్య, శీలం తిరుపతిరెడ్డి, పి హరిచరణ్, కాశీ విశ్వనాధ్ గౌడ్, కన్యగారి నర్సింహ్మారెడ్డి, జె ఆనంద్ గౌడ్, ఎస్ జయప్రకాశ్ తదితరులు దేవాలయాలలో జరిగిన పూజలలో పాల్గొన్నారు.

**హస్తాల వీరన్న గుట్ట లో ఘనంగా దసరా సంబరాలు**

చింతల్మెట్ హస్తాల వీరన్న గుట్టలో ఈ సంవత్సరం దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు స్థానిక ప్రజల తో కలసి కాషాయ జెండాలు చేత ధరించి హస్తాల వీరన్న గుట్ట వద్ద దసరా వేడుకలను నిర్వహించారు.

**బుద్వేల్ లో రాహణ దహనం :**

బుద్వేల్ బస్తీ పెద్ద ల ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వీరాంజనేయ స్వామీ దేవాలయం ఆవరణలో రావణ దహనం నిర్వహించారు. అనంతరం శ్రీ శివాంజనేయ స్వామీ దేవాలయంలో జమ్మి పూజ నిర్వహించి పూజలు చేశారు. వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాజేం ద్రనగర్ హరిహర క్షేత్రం అవరణలో రాహణ దహనం, జమ్మి పూజ కార్యక్రమాలను భక్తీ శ్రద్ధలతో నిర్వహించారు. వందలాది మంది భక్తులు పూజలలో పాల్గొన్నారు.

**శ్రీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయంలో టీడీపీ నేత యు విజయ్ కుమార్ పూజలు**

కాటేదాన్ టీ ఎన్ జీ ఓ స్ కాలనీలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయంలో జరిగిన దసరా వేడుకలలో టీడీపీ నాయకులు ఉస్కెమూరి విజయ్ కుమార్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా నృత్యాలు చేసిన చిన్నారులను ఆయన అభినందించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మొక్కుకున్నారు.

**కన్నుల పండువగా దుర్గామాత ఊరేగింపు**

రాజేంద్రనగర్ మాణిక్యమ్మ కాలనీ లో పి. చంద్రకాంత్ ముదిరాజ్, పి. సాయి కిరణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత ఊరేగింపు కార్యక్రమం అం గరంగ వైభవంగా జరిగింది. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న అమ్మవారిని పత్తికుంట లో నిమజ్జనం చేశారు. నిమజ్జన ఊరేగింపు యాత్ర శోభాయమానంగా జరిగింది. ర్యాలీ లో బీజేపీ గోల్కొండ గోషామహాల్ జిల్లా కన్వీనర్ వై.శ్రీధర్, నాయకులు ధీరజ్ యాదవ్, ఈ వేణుగోపాల్ లు పాల్గొన్నారు. పూజా ఏర్పాట్లను పి ఉ మామహేశ్వరీ, మహిత, విజశ్రీ, లావణ్య, పవన్ కుమార్, సుకృత, నారాయణ లు దగ్గరుండి చూసుకున్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ కొని గుర్తు తెలియని మహిళ దుర్మరణం

**బుద్వేల్, అక్టోబరు 21 (ప్రభాత ఉదయం)**

బుధవారం తెల్లవారుజామున 3.30 గంటలకు పీవీ నర్సింహ్మారావు ఎక్స్ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 135 హైదర్ గూడ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ గుర్తు తెలియని మహిళ దుర్మరణం చెందింది. ఎస్ఐ షమా నూర్ తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి... బుధవారం తెల్లవారుజామున 3.30 నిమిషాలకు గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ మహిళ దుర్మరణం చెందింది. ఆమె వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఒంటిపై ఆకుపచ్చ చీర దరించి ఉంది. ఆమె సమాచారం తెలిసిన వారు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్ధం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు ను రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

# విజయ దశమి ప్రజల జీవితాలలో వెలుగులు నింపాలి: ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

### వర్షాలు సమృద్ధిగా కురవాలి: మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి

### ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు : తోకల శ్రీనివాస్ రెడ్డి

**బుద్వేల్, అక్టోబరు 21 (ప్రభాత ఉదయం)**

విజయ దశమి ప్రజల జీవితాలలో వెలుగులు నింపాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు. దసరా పండుగ సందర్భంగా తనను కలవడానికి వచ్చిన వారికి ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి కార్మికులు, కర్షకులు, సేవా రం గంలో ఉన్న ప్రతి ఒక్కరి జీవితాలలో మార్పులు తీసుకురావాలన్నారు. ప్రభుత్వాలు కూడా సేవా రంగంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, వాచ్మెన్లు, అటెండర్ల జీవితాలలో వెలుగులు నింపడానికి నూతన సంస్కరణలను చేపట్టాలన్నారు.



ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ను కలిసి స్వీట్ బాక్స్ ను అందచేస్తున్న బండారి శంకర్

కాయా కష్టం చేసే పారిశుధ్య కార్మికుల కు ఇచ్చే వేతనాలను పెంచితే బాగుంటుందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ చూడాలని భగవం తుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు.

**వర్షాలు సమృద్ధిగా కురవాలి: పి సబితా ఇంద్రారెడ్డి**

వర్షాలు సమృద్ధిగా కురువాలని, ప్రజలందరు చల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నానని మాజీ మ ంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తనను కలసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ నాయకులతో ఆమె మాట్లాడారు. ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటు ముందుకు సాగాలన్నారు. సబితా ఇంద్రారెడ్డి ని కలసిన వారిలో నాయకులు కొలన్ సుభాష్రెడ్డి, ఎస్ వెంకటేశ్, నోముల రాము యాదవ్, డి రమేశ్ ముదిరాజ్, కొంపల్లి జగదీశ్, పచ్చ శ్రీనివాసులు, వాసు, తదితరులున్నారు.



మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ని కలసి దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న బీ ఆర్ ఎస్ నాయకులు



దసరా వేడుకలలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**ప్రజలందరికి పండుగ శుభాకాంక్షలు : తోకల శ్రీనివాస్ రెడ్డి**

రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలందరికి మాజీ కార్పొరేటర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారికి పూజలు చేశానన్నారు.

# ట్రాఫిక్ చక్రబంధంలో ఐటి నగరం

## రోడ్లపై గంటల నిరీక్షణ.. బంధాలకు దూరం.. అత్యవసర వేళల్లో ప్రాణాలకే ముప్పు!

## ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ నరకం.. పాలకుల ప్రణాళికా లోపమా? అధికారుల నిర్లక్ష్యమా?



**శేరిలింగంపల్లి: అక్టోబర్ 21, (ప్రభాత ఉదయం)**

ఐటీ హబ్‌గా ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన హైటెక్ సిటీ పరిసరాలు.. అభివృద్ధికి చిరునామాగా నిలవాల్సిన శేరిలింగంపల్లి.. నేడు ట్రాఫిక్ కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది! రోడ్లపై అడుగు ముందుకు పడాలంటే నరకయాతనే.. రెండు కిలోమీటర్ల దూరంలోని మార్కెట్‌కు వెళ్లాలన్నా గంటల తరబడి ప్రయాణం.. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాలంటే సహనానికి పరీక్ష! ఉద్యోగ ఒత్తిడితో సతమతమవుతున్న ఐటీ ఉద్యోగులు, చిరుద్యోగులు, వ్యాపారులు, సామాన్య ప్రజలు ట్రాఫిక్ ఉచ్చులో చిక్కుకుని విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. వారాంతంలోనైనా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ప్రశాంతంగా గడపాలన్న ఆశకు ట్రాఫిక్ అడ్డుగోడగా మారుతోంది. అభివృద్ధి పరుగులు తీస్తున్న నగరంలో రహదారులపై మాత్రం వాహనాలు అంగుళం కదలలేని దుస్థితి నెలకొనడం పాలనా ప్రణాళికలపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

**బంధాల మధ్య ట్రాఫిక్ గోడ!**

కూకట్‌పల్లిలో నివసించే రాంబాబు.. లింగంపల్లిలో ఉన్న తన తమ్ముడు రాకేష్ ఇంటికి వెళ్లాలంటేనే గంటల తరబడి ప్రయాణించాల్సిన పరిస్థితి. ఆదివారం లభించే ఒక్కరోజు సెలవులో కుటుంబ సభ్యులతో గడపాలనుకున్నా.. సగం రోజు రహదారులపైనే గడిచిపోతోందన్నది నగర జీవుల ఆవేదన. ఉద్యోగం ఒకవైపు.. ఇంటికి చేరాలన్న ఆరాటం మరోవైపు.. ఈ రెండింటి మధ్య ట్రాఫిక్ ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తోంది. రహదారులపై వృథా అవుతున్న సమయం కుటుంబాలకు దూరాన్ని పెంచుతూ, మానసిక ఒత్తిడిని మరింత తీవ్రం చేస్తోంది.

**జనాభా పెరుగుతోంది.. రోడ్లు మాత్రం ఇరుకవుతున్నాయి!**

శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మదీనాగూడ, కొండాపూర్, హైటెక్ సిటీ, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లో జనాభా, వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నాయి. కానీ పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా రహదారుల విస్తరణ, ప్రత్యామ్నాయ మార్గాల అభివృద్ధి, ట్రాఫిక్ నిర్వహణ ఎంతవరకు జరుగుతున్నాయన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మియాపూర్ నుంచి సంగారెడ్డి వైపు చేపడుతున్న రహదారి విస్తరణ, ఫ్లైఓవర్ పనులు పూర్తయ్యే వరకు వాహనదారుల ఇబ్బందులు కొనసాగుతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

కొండాపూర్, హైటెక్ సిటీ, కేపీహెచ్‌బీ నుంచి ఐటీ కారిడార్‌కు చేరుకునే మార్గాలతో పాటు షేక్‌పేట, జూబ్లీహిల్స్ వైపు నుంచి వచ్చే రహదారులపైనా రద్దీ వాహనదారులకు పరీక్షగా మారుతోంది. అభివృద్ధి పనులు చేపట్టడం అవసరమే అయినా.. నిర్మాణ దశలో ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యామ్నాయ మార్గాలు, సమయపాలనపై సమగ్ర ప్రణాళిక ఉండాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రోడ్లు విస్తరించే వరకు ప్రజలు ప్రతిరోజూ గంటల తరబడి రహదారులపైనే బందీలుగా ఉండాలా? అన్న ప్రశ్న అధికార యంత్రాంగం ముందుంది.

**నో ఎంట్రీ నిబంధనలు కాగితాలకే పరిమితమా?**

సైబరాబాద్ పరిధిలో భారీ వాహనాల రాకపోకలపై అమలవుతున్న నో ఎంట్రీ నిబంధనలను కఠినంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని వాహనదారులు కోరుతున్నారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 10.30 గంటల వరకు భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ప్రైవేట్ బస్సులు, వాటర్ ట్యాంకర్లు, టిప్పర్లు, రెడీమిక్స్ వాహనాలు, గూడ్స్ లారీలు రద్దీ సమయాల్లోనూ రోడ్లపై కనిపిస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రైవేట్ బస్సుల రాకపోకలపైనా నిబంధనలను సమర్థంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు తిరుగుతున్నాయనే ఫిర్యాదులపై ట్రాఫిక్ అధికారులు తనిఖీలు నిర్వహించి, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి. అనుమతుల జారీ, ఆంక్షల అమలులో అక్రమాలు లేదా అవినీతి జరుగుతున్నాయనే ఆరోపణలు ఉంటే వాటిపై పారదర్శకంగా విచారణ జరిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలపై ఆధారాలతో విచారణ జరగాలి.. నిబంధనలు ఉల్లంఘించిన వారెవరైనా చర్యలకు అతీతులు కాకూడదు.

**అంబులెన్స్‌కూ దారి దొరకని దుస్థితి!**

ట్రాఫిక్ సమస్య కేవలం సమయాన్ని వృథా చేసే అంశం మాత్రమే కాదు.. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలకు ముప్పుగా మారే ప్రమాదం ఉంది. రద్దీ రహదారుల్లో అంబులెన్స్‌లు ముందుకు కదల్లేకపోతే రోగులను ఆసుపత్రికి తరలించడంలో జాప్యం జరిగే అవకాశం ఉంది. ప్రతి నిమిషం విలువైన వైద్య అత్యవసర వేళల్లో అంబులెన్స్‌లకు మార్గం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్ నియంత్రణలో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చన్న విషయాన్ని అధికారులు విస్మరించకూడదు.

**కాలం చెల్లిన వాహనాలు.. కాలుష్యానికి మరో కారణం!**

నగర రహదారులపై తిరుగుతున్న కాలం చెల్లిన వాహనాల నియంత్రణపైనా ప్రభుత్వం దృష్టి సారించాలని పర్యావరణ ప్రేమికులు, స్థానికులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వ వాహన స్క్రాప్ పాలసీ విధానానికి అనుగుణంగా అర్హత కోల్పోయిన వాహనాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం, కాలుష్య నియంత్రణ పరీక్షలను కఠినంగా అమలు చేయడం అవసరం. అయితే స్క్రాప్ పాలసీ విధానం అమలుతోనే ట్రాఫిక్ సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని భావించలేం. ప్రజా రవాణాను బలోపేతం చేయడం, రహదారుల సామర్థ్యాన్ని పెంచడం, అక్రమ పార్కింగ్‌ను అరికట్టడం, ట్రాఫిక్ సిగ్నళ్ల సమన్వయాన్ని మెరుగుపరచడం వంటి చర్యలూ సమాంతరంగా చేపట్టాలి.

**ప్రభుత్వం మేల్కొనేదెప్పుడు?**

ఐటి నగరంలో ట్రాఫిక్ సమస్యకు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. రద్దీ ప్రాంతాలను గుర్తించి సమగ్ర ట్రాఫిక్ అధ్యయనం నిర్వహించడం, రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయడం, భారీ వాహనాలపై నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం, అంబులెన్స్‌లకు నిరంతర మార్గం కల్పించడం, ట్రాఫిక్ పోలీసుల పనితీరుపై పర్యవేక్షణ పెంచడం అత్యవసరమని నగర పౌరులు సూచిస్తున్నారు.

ట్రాఫిక్ విభాగంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై నిష్పక్షపాత విచారణ జరిపి, తప్పు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే బాధ్యతల మార్పు వంటి పరిపాలనా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.ప్రజలు కోరుకుంటున్నది విలాసవంతమైన రహదారులు కాదు.. గమ్యస్థానానికి సమయానికి చేరుకునే అవకాశం. గంటల తరబడి రోడ్లపై నిలిచిపోయే జీవితం కాదు.. కుటుంబంతో ప్రశాంతంగా గడిపే కొంత సమయం. ట్రాఫిక్‌లో చిక్కుకుని ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితులు కాదు.. అత్యవసర వేళల్లో సురక్షిత ప్రయాణమని అధికారులు గ్రహించాలి.అభివృద్ధి అంటే ఆకాశహర్మ్యాలు నిర్మించడం మాత్రమే కాదు.. ఆ నగరంలో నివసించే ప్రజలకు సాఫీగా ప్రయాణించే హక్కును కల్పించడం కూడా! ఇప్పటికైనా ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసు యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపట్టి శేరిలింగంపల్లి ట్రాఫిక్ చక్రబంధం నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని లేకపోతే. ఐటీ నగరపు వెలుగుల వెనుక ట్రాఫిక్ చీకట్లు ప్రజల జీవితాలను మరింతగా కమ్ముకునే ప్రమాదం ఉందని మేధావులు చూచిస్తున్నారు.



## ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలో మహిళలకు ఉద్యోగ అవకాశం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్21(ప్రభాత ఉదయం):**

రామగుండం ఏరియా-1 జీఎం ఆదేశాల మేరకు ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలో మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జీఎం లలిత్ కుమార్ తెలిపారు.ఈ ఉద్యోగాల్లో పని చేయడానికి మహిళలకు మాత్రమే అర్హత 10వ తరగతి పాస్/ఇంటర్/డిగ్రీ ఆపైన 40 ఏళ్ల లోపు వయస్సు ఉన్న యువతులు, మహిళలకు అవకాశం ఉంటుందని, యువతులు, మహిళలకు 200 శాతం భద్రత ఉంటుందని జీఎం పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు జీతం రూ. 20,000 ఉంటుందని.. వసతి, ఉచిత భోజనం, ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామని జీఎం లలిత్ కుమార్ అన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 24, శనివారంలోపు రామగుండం ఏరియా- 1, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్, తిలక్ నగర్, గోదావరిఖనిలో ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9494313794, 8792610210 సంప్రదించవచ్చని వివరించారు.



## విశేషంగా ఆకట్టుకున్న అకాడ ప్రదర్శనలు కర్ర సామును ప్రదర్శించిన సంధ్యారాణి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్21(ప్రభాత ఉదయం):**

సాంప్రదాయ యుద్ధ కళలలో ఒకటైనా అకాడ ప్రదర్శనలు లో విశేషంగా ఆకట్టుకున్నాయి. మాజీ జడ్పీ సభ్యురాలు కందుల కర్రసాము, కత్తి సాము తదితర యుద్ధ విన్యాసాలను ప్రదర్శించి అదరగొట్టారు.విజయదశమి సందర్భంగా గోదావరిఖని విద్యానగర్ లోని జై భారత్ హనుమాన్ అకాడ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన జరిగింది. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్ ముఖ్యతిథిగా హాజరై ఈ ప్రదర్శనల ను ప్రారంభించారు. అతిథులు మాట్లాడుతూ 40 యేళ్లుగా గోదావరిఖనిలో సాంప్రదాయ యుద్ధ కళ అకాడకు పురుడు పోస్తూ ప్రతి ఏటా దసరా రోజున ప్రదర్శనలు ఇవ్వడం అభినందనీయమన్నారు. అంతరించిపోతున్న యుద్ధ కళను రక్షిస్తున్న వస్తాదు లను అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకులు కందుల సంధ్యారాణి పోషం, చిలుక. భారతి, ఆసంపల్లి వాసు, గాలిపల్లి తిరుపతి, కెప్టెన్లు కండె సమ్మయ్య, శ్రీనివాస్, మచ్చ విశ్వాస్, దామోదర్, జనగామ శ్రీనివాస్ తోపాటు కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ధర్మపురిలో ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్21(ప్రభాత ఉదయం):**

ప్రజల ఆస్తి, ప్రాణ రక్షణే ధ్యేయంగా కర్తవ్య నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరుల త్యాగాలు అజరామరమని ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ. రాం నర్సింహారెడ్డి పేర్కొన్నారు. అక్టోబర్ 21 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం' సందర్భంగా గతంలో నక్సలైట్ల కాల్పుల్లో వీరమరణం పొందిన పోలీస్ అమరులు కోమల్ రెడ్డి, శ్రీనివాస్, ప్రకాష్, రాజయ్య, శ్రీనివాస్‌ల సంస్మరణ సభను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎన్. సుధాకర్, ఎస్ఐ-2 ఎం. రవీందర్ కుమార్‌లతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, విలేకరులు, పౌరులు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం సీఐ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం నిబద్ధతతో పనిచేస్తోందని తెలిపారు. దేశ రక్షణ, ప్రజా శ్రేయస్సు కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించిన అమరవీరుల అడుగుజాడలే పోలీసు శాఖకు నిరంతర స్ఫూర్తిదాయకమని స్పష్టం చేశారు.



## విజయదశమి అందరికీ విజయాలను చేకూర్చాలి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్21(ప్రభాత ఉదయం):**

విజయదశమి పర్వదినం సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి,మంచిర్యాల జోన్‌ల ప్రజలకు,పోలీసు అధికారులు, సిబ్బందికి,వారి కుటుంబ సభ్యులకు అన్ని రంగాల్లో విజయాలు చేకూరాలని, రామగుండం పోలీస్ కమిషనరేట్ అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలవాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆకాంక్షించారు. విజయదశమి సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఆయుధ పూజ,వాహన పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ,శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గామాత ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాల తో,విజయాలతో జీవించాలని ఆకాంక్షించారు.పోలీస్ శాఖలో ప్రతి స్థాయి అధికారి,సిబ్బంది ప్రజా రక్షణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలని,తద్వారా పోలీస్ శాఖ గౌరవాన్ని,రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రతిష్టను మరింత పెంచాలని సూచించారు.అనంతరం పోలీస్ వాహనాల కు పూజలు నిర్వహించి, పోలీసు అధికారులు,సిబ్బంది, ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,ఏఆర్ ఏసీపీప్రతాప్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్,రామగుండం సీఐ కృష్ణ కుమార్,రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర రావు,స్పెషల్ ఆర్ఐ దామోదర్, శ్రీనివాస్,మల్లేశం,శేఖర్,సంపత్ రమేష్,సీసీ సందీప్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు,డ్రైవర్లు,ఏఆర్ సిబ్బంది,స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## దేశం సుభిక్షంగా ఉండాలి.. అమ్మవారిని ప్రార్థించిన బండి సంజయ్

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్21(ప్రభాత ఉదయం):**

నగరంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం పలు దుర్గాదేవి మండపాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, దేశం, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.అనంతరం టవర్ సర్కిల్‌లో ఫ్రెండ్స్ అసోసియేషన్, కమాన్ వద్ద కమాన్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగునూరులోని దుర్గా భవానీ ఆలయాన్ని సందర్శించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. అమ్మవారి కృపతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర ఉప మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పలువురు బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608